సాక్షి కరీంనగర్

శనివారం ǀ 18 ǀ జనవరి ǀ 2025

I



మీడియేషన్‌కు న్యాయవాదులు

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌కు చెందిన న్యాయవాదులు తుమ్మనపల్లి లక్ష్మణ్‌రావు, శ్రీరాముల కిషన్, పెరుగ రంగయ్య మీడియేటర్స్‌గా శిక్షణ పూర్తి చేసుకున్నారు. వీరిని జిల్లా జడ్జి ప్రతిమ అభినందించారు.



పత్తి క్వింటాల్‌కు రూ.7,350

జమ్మికుంట: స్థానిక మార్కెట్లో పత్తి రూ.7,350 పలికింది. మార్కెట్‌కు 14వాహనాల్లో 158 క్వింటాళ్ల పత్తిని రైతులు తెచ్చారు. మోడల్ ధర రూ.7,250, కనిష్ట ధర రూ.6,800 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
28.0/15.0

వాతావరణం

జిల్లాలో నేడు వాతావరణం సాధారణంగా ఉంటుంది. రాత్రిపూట చలితీవ్రత కొనసాగుతుంది. చలిగాలులు వీస్తాయి. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

అర్బన్‌బ్యాంక్ చైర్మన్‌గా గడ్డం విలాస్‌రెడ్డి



మంత్రి పొన్నంను కలిసిన విలాస్‌రెడ్డి

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ అర్బన్ బ్యాంక్ చైర్మన్‌గా నగరంలోని భగత్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం విలాస్‌రెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు అర్బన్ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని నియమిస్తూ వ్యవసాయ, సహకారశాఖ జీవో ఆర్‌టీ నంబరు 21ద్వారా ఈ నెల 15వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్‌గా గడ్డం విలాస్‌రెడ్డి, సభ్యులుగా మడుపు మోహన్, ముక్కా భాస్కర్, బొమ్మరాతి సాయికృష్ణ, ముద్దసాని క్రాంతి, రేగొండ సందీప్, మూల లక్ష్మి, ఎ.విద్యాసాగర్, ఈ.లక్ష్మణ్‌రాజు, ఎండీ.షమీయోద్దీన్, మంగి రవీందర్, నాగుల సతీష్, మార్క రాజులు నియమితులయ్యారు. కాగా గతంలో సిటీ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా, డీసీసీ కార్యదర్శిగా, డీసీసీ అధికార ప్రతినిధిగా, వేములవాడ దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యుడిగా వివిధ హోదాల్లో పనిచేసిన విలాస్‌రెడ్డికి చైర్మన్ పదవి దక్కింది. నూతనంగా నియమితులైన చైర్మన్ విలాస్‌రెడ్డి, సభ్యులు శుక్రవారం హుస్నాబాద్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

నిబంధనలు పాటించాలి



భూములు పరిశీలిస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి

జమ్మికుంట: రాష్ట్ర ప్రభుత్వం నిబంధనల మేరకు సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, తాహసీల్దార్ రమేశ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని మడిపల్లి, బిజిగిరిషరీఫ్, తనుగుల, వావిలాల గ్రామాల్లో నాలుగు బృందాలుగా ఏవో ఖాదర్ హుస్సేన్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. రియల్‌ఎస్టేట్ లే అవుట్‌లు, గోదాములు, మైనింగ్‌కు ఉపయోగించే భూములు, రాళ్లురప్పలు, గుట్టలు, చెరువుల్లోని భూములను పరిశీలించినట్లు తెలిపారు. ఈ భూముల వివరాలను ఈనెల 21వ తేదీన గ్రామసభల్లో ప్రదర్శించి, తీర్మానించడం జరుగుతుందని అన్నారు. ఆర్‌ఐ శంకర్, ఏఈవో రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

బల్దియాకు ఊరట

- స్టాంప్‌డ్యూటీ కింద రూ.47 కోట్లు
- పట్టణ ప్రగతి నిధులు రూ.2.20కోట్లు

కరీంనగర్ కార్పొరేషన్: ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతున్న నగరపాలకసంస్థకు కాస్త ఊరట లభించింది. స్టాంప్‌డ్యూటీ కింద రావాల్సిన రూ.47 కోట్లను నగరపాలకసంస్థకు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. స్టాంప్ డ్యూటీ కింద మున్సిపాలిటీలకు రావాల్సిన వాటా ఆరేడేళ్లుగా దక్కడం లేదు. ఈ నిధులతో ముందుగా విద్యుత్ బిల్లులు, కార్మికుల జీతాలు చెల్లించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. దీంతో సుమారు రూ.20 కోట్లు బకాయిలకు చెల్లించనున్నారు. మిగిలిన రూ.27 కోట్లను ఇతరత్రా బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోనున్నట్లు సమాచారం. పట్టణ ప్రగతి కింద రూ.2కోట్ల 20 లక్షల నిధులు విడుదలయ్యాయి. అయితే పట్టణ ప్రగతి కింద ఇప్పటికే చేసిన పనులకు సంబంధించి రూ.12 కోట్ల బకాయిలు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. రూ.12 కోట్ల బకాయిలకు కంటితుడుపు చర్యగా రూ.2.20 కోట్లు మాత్రమే విడుదల చేశారు. ఏదేమైనా ప్రభుత్వాల నుంచి నిధుల కోసం ఎదురుచూస్తున్న నగరపాలకసంస్థకు ఆర్థికంగా ఇది కాస్త ఉపశమనాన్ని కలిగించింది.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్: 2025–26 ఏడాదికి గాను జిల్లాలోని తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి, 6, 7, 8 తరగతులు, ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో, ఒకేషనల్ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్–ఎలక్ట్రికల్ టెక్నీషియన్) కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల కోసం ఆసక్తి అర్హత ఉన్న విద్యార్థులు ఫిబ్రవరి 28 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం లేదా స్టడీ సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణపత్రం, కుల ధ్రువీకరణ పత్రం(అవసరమైనచో), సెల్ నంబర్ , నివాస ధ్రువీకరణ పత్రాలు అవసరం అన్నారు. వివరాలకు సంబంధిత మైనారిటీ గురుకుల పాఠశాలలో లేదా జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో 0878–2957085 ఫోన్‌నంబర్‌కు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల లోపు సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

మిగిలింది వారమే!

- బల్దియాల్లో ప్రత్యేక పాలనకు సిద్ధం
- పాలకవర్గాల పదవీకాలం 26వరకే
- కరీంనగర్ కార్పొరేషన్‌కు 28వ తేదీ వరకు అవకాశం
- ప్రత్యేకాధికారుల నియామకానికి ప్రభుత్వం ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో రెండు కార్పొరేషన్లు
- 14 మున్సిపాలిటీలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పాలకమండళ్ల పదవీకాలం మరో ఎనిమిది రోజుల్లో ముగియనుంది. పాలకవర్గాల గడువు ముగిసేలోగానే ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉండగా, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచే దిశలో కాంగ్రెస్ ప్రభుత్వం డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేసి కులగణన చేపట్టింది. ఆ కమిటీ నివేదికను అనుసరించి పంచాయతీలు, బల్దియాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే పదవీకాలం పూర్తి చేసుకున్న సర్పంచ్‌లు, మండల, జిల్లా పరిషత్‌ల్లో ప్రత్యేకాధికారుల పాలన సాగుతుండగా, అదేబాటలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న బల్దియాల్లో ఈనెల 27నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి రానుంది. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

గడువు జనవరి 26 వరకే

ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, రామగుండం కార్పొరేషన్‌తో పాటు 14మున్సిపాలిటీలున్నాయి. ఆయా పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించగా 2020 జనవరి 27న కొలువుదీరాయి. ఈనెల 26తో పాలకవర్గాలకు పదవీకాలం ముగియనుంది. కరీంనగర్ కార్పొరేషన్‌కు రెండురోజుల ఆలస్యంగా ఎన్నికలు జరగటంతో 2025 జనవరి 28తో పదవీకాలం ముగియనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో విజయంతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పలు మున్సిపాలిటీల్లో అవిశ్వాసాలు పెట్టగా పలు చైర్మన్ పదవులు కాంగ్రెస్ వశం అయ్యాయి. పలు బల్దియాల్లో బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు కారు దిగి హస్తం పార్టీలో చేరారు. కరీంనగర్ కార్పొరేషన్లలో పలువురి కార్పొరేటర్లపై భూ కబ్జా కేసులు నమోదుకావడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

పంచాయతీ, పరిషత్‌ల తరువాతే

గ్రామపంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల తర్వాతే మున్సిపల్ ఎన్నికలు రానున్నాయి. ఎన్నికలకు ముందుగానే కొత్త మున్సిపాలిటీలు, విలీనమైన గ్రామాల్లో వార్డుల విభజన చేయాలని అధికారులు నిర్ణయించారు. దీంతో పాటు ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఆధారంగా బీసీ కమిషన్ నివేదిక అందిస్తుంది. ఆ తర్వాత కేబినెట్ రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశముంది. అనంతరం పంచాయతీల్లో, మండల, జిల్లాపరిషత్‌లకు, తరువాత మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో బల్దియాల్లో మరో ఏడాదికి పైగా ప్రత్యేకాధికారుల పాలనలోనే కొనసాగే అవకాశముందని అధికారులు, ఎన్నికల్లో పోటీచేసే ఆశావహులు అంచనా వేస్తున్నారు.

అవిశ్వాసాలు.. జంపింగ్‌లు

- మంథని మున్సిపాలిటీలో 13వార్డుల్లో ఇద్దరు కాంగ్రెస్, 11 మంది బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందగా పుట్ట శైలజ చైర్‌పర్సన్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏడుగురు బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. శైలజపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో రమ మున్సిపల్ చైర్‌పర్సన్ కావడంతో కాంగ్రెస్ వశమైంది.
- సుల్తానాబాద్ మున్సిపాలిటీలో 15 వార్డులుండగా, తొమ్మిది మంది బీఆర్‌ఎస్, ఆరుగురు కాంగ్రెస్ నుంచి గెలుపొందారు. బీఆర్‌ఎస్ నుంచి చైర్‌పర్సన్‌గా సునీత ఎన్నికయ్యారు. తరువాత అవిశ్వాసం నెగ్గటంతో గాజుల లక్ష్మీరాజమల్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.
- జగిత్యాల మున్సిపాలిటీలో 48 వార్డులు ఉండగా, 30 బీఆర్‌ఎస్ గెలుచుకోగా, కాంగ్రెస్ 7, బీజేపీ 3, ఇండిపెండెంట్ 6, ఎంఐఎం 1, ఏఐఎఫ్‌బీ ఒక్కసీటు గెలుచుకుంది. బీఆర్‌ఎస్ నుంచి భోగ శ్రావణి చైర్మన్‌గా ఎంపికయ్యారు. కొన్ని కారణాలతో రాజీనామా చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అవిశ్వాస తీర్మానం పెట్టారు. బీఆర్‌ఎస్ రెబల్ ఆడవాల జ్యోతి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా కాంగ్రెస్ మద్దతుతో ఎన్నికయ్యారు.
- కోరుట్ల మున్సిపాలిటీలో 33 వార్డులకు బీఆర్‌ఎస్ 21చోట్ల, బీజేపీ 5, ఎంఐఎం 2, కాంగ్రెస్ 2, ముగ్గురు స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికయ్యారు. బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికైన కౌన్సిలర్ అన్నం లావణ్య ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరి మున్సిపల్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.
- రాయికల్ మున్సిపాలిటీలో 12 వార్డులు ఉండగా 10 బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ చెరొక్కటి గెలిచాయి. మున్సిపల్ చైర్మన్‌గా బీఆర్‌ఎస్ నుంచి మోర హన్మాండ్లు ఎంపికయ్యారు. నాటకీయ పరిణామాల నేపథ్యంలో అవిశ్వాసం పెట్టగా, వీగిపోవడంతో మళ్లీ మోర హన్మాండ్లుకు చాన్స్ వచ్చింది.
- రామగుండం కార్పొరేషన్‌లో 50డివిజన్లు ఉండగా, కాంగ్రెస్ 11, బీఆర్‌ఎస్ 18, బీజేపీ 6, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 9, ఇతరులు 6సీట్లు గెలిచారు. బీఆర్‌ఎస్ నుంచి మేయర్‌గా గెలిచిన అనిల్‌కుమార్, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి హస్తం తీర్థం పుచ్చుకున్నారు.
- సిరిసిల్లలో 39వార్డులకు బీఆర్‌ఎస్22, బీజేపీ 03, కాంగ్రెస్ 02, ఇండిపెండెంట్ అభ్యర్థులకు 12మంది గెలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఐదుగురు కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో కలిశారు. కానీ అవిశ్వాసం పెట్టకపోవడంతో మున్సిపల్ చైర్ పర్సన్‌గా జిందం కళా చక్రపాణి కొనసాగుతున్నారు.

నయా బల్దియా

- 66 డివిజన్లతో కొత్త ముఖచిత్రం
- గ్రామాల విలీనానికి రాజముద్ర
- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: నగరపాలకసంస్థలో కొత్తపల్లి మున్సిపాలిటీ సహా ఆరుగ్రామాల విలీనానికి రాజముద్ర పడింది. కొత్తపల్లితో పాటు మండలంలోని చింతకుంట, మల్కాపూర్, లక్ష్మిపూర్, కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్, గోపాల్‌పూర్, దుర్శేడ్ గ్రామాలను కలుపుకొని 66 డివిజన్‌లతో నగరపాలకసంస్థ ఏర్పడింది.

మంత్రి పొన్నం ప్రతిపాదన మేరకు

నగరపాలకసంస్థలో కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు, ఆరు గ్రామాలను విలీనం చేయాలన్న మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రతిపాదన మేరకు కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వానికి అధికారికంగా నివేదిక పంపించారు. కలెక్టర్ నివేదిక మేరకు మున్సిపాలిటీ, ఆరు గ్రామాలను నగరపాలకసంస్థలో విలీనం చేస్తున్నట్లు, గత నెలలో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రకటించారు. దీనిపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేసినా, బిల్లును గవర్నర్‌కు పంపించారు. దీంతో అసెంబ్లీలో తీర్మాణించిన మేరకు ఒక మున్సిపాలిటీ, ఆరు గ్రామాల విలీనాన్ని ఆమోదిస్తూ, 66 డివిజన్‌లతో నగరపాలకసంస్థను విస్తరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేసింది.

50 డివిజన్ల నుంచి 66కు

మున్సిపాలిటీగా ఉన్న కరీంనగర్‌ను 2005లో 50 డివిజన్‌లతో నగరపాలకసంస్థగా అప్‌గ్రేడ్ చేశారు. 2020లో సమీపంలోని తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్, ఆరెపల్లి, సీతారాంపూర్, రేకుర్తి, పద్మనగర్, అలుగునూరు, సదాశివపల్లి గ్రామాలను విలీనం చేశారు. దీనితో నగరపాలకసంస్థలో ఉన్న డివిజన్ల సంఖ్య 50నుంచి 60కి చేరింది. నగరానికి దూరంగా ఉన్న వల్లంపహాడ్, సదాశివపల్లిలను విలీనం చేసి, నగరంలోనే కలిసి ఉన్న బొమ్మకల్‌ను విలీనం చేయకపోవడం అప్పట్లో విమర్శలకు దారితీసింది. ప్రస్తుతం కొత్తపల్లి మున్సిపాలిటీతో పాటు, బొమ్మకల్ సహా ఆరు గ్రామాలను విలీనం చేయడంతో, డివిజన్‌ల సంఖ్య 60 నుంచి 66కు చేరుకుంది.

నిధుల పంచాయితీ

నగరపాలకసంస్థలో గ్రామాల విలీనం పూర్తయినా, నిధుల పంచాయితీ వెంటాడుతోంది. గతంలో నగరంలో కలిసిన విలీన గ్రామాలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోలేదంటూ పలువురు తాజా విలీన ప్రక్రియను వ్యతిరేకించారు. విలీన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయించాలంటూ మేయర్ యాదగిరి సునీల్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

సాగు భూములకే ‘రైతు భరోసా’

- రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు నిరంతర ప్రక్రియ
- బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సైదాపూర్/చిగురుమామిడి: సాగుకు యోగ్యమైన భూములకే ప్రభుత్వం రైతు భరోసా ఇస్తుందని బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లి, చిగురుమామిడి మండలం ఇందుర్తిలో మాట్లాడారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల మంజూరులో పైరవీలు ఉండవన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 90లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయని వెల్లడించారు. ఈనెల 26 నుంచి కొత్తకార్డులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రజాపాలన గ్రామసభల్లో దరఖాస్తులు చేసుకున్న వారిపేరు జాబితాలో లేకుంటే నేరుగా మరోసారి దరఖాస్తు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయంతో ఉండాలన్నారు. సైదాపూర్ మండలం ఎలబోతారం నుంచి బొమ్మకల్ అమ్మనగుర్తి వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా, కాంట్రాక్టర్ పని చేయడంలేదని గొడిశాల, బొమ్మకల్ గ్రామ కార్యకర్తలు మంత్రికి విన్నవించారు. వెంటనే పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు మంత్రి సూచించారు. ఇందుర్తిని కొత్త మండలంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు. దుద్దెనపల్లి, ఎగ్లాస్‌పూర్, గర్రెపల్లి, వెన్నంపల్లి, ఇందుర్తి, నవాబుపేట, కొండాపూర్, తదితర గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంత్రి పరామర్శించారు. కాంగ్రెస్ సైదాపూర్ మండల అధ్యక్షుడు దొంత సుధాకర్, చిగురుమామిడి మండలాధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోదాములు తరలిస్తాం

- మేయర్ సునీల్‌రావు



గోదాంగడ్డలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: ప్రజల డిమాండ్ మేరకు గోదాంగడ్డలోని సీడబ్ల్యూసీ గోదాములు దూర ప్రాంతానికి తరలించేందుకు కృషి చేస్తామని మేయర్ వై.సునీల్‌రావు హామీ ఇచ్చారు. నగరంలోని 34వ డివిజన్ గోదాంగడ్డలో రూ.74 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పైప్‌లైన్ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. గోదాములను తరలించాలని ఏళ్లకాలంగా ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సహకారంతో గోదాములను రైల్వే స్టేషన్ ప్రాంతంలోకి తరలిస్తే ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. తమ పాలకవర్గం వచ్చాక సాధారణ నిధులు రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని, నగరపాలకసంస్థ చరిత్రలో ఇది మొదటిసారన్నారు. నగర వ్యాప్తంగా ప్రధాన రహదారులన్నీటిని అందంగా మార్చామని తెలిపారు. కార్పొరేటర్లు షఫీరా అంజూమ్ బర్కత్ అలీ, ఇఫ్రా తహరీన్ అఖీనా, డీఈ అయూబ్ ఖాన్, ఏఈ గట్టు స్వామి పాల్గొన్నారు.

ప్రజల దృష్టిని మళ్లించే ఎత్తుగడ

- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



మాట్లాడుతున్న పొన్నాల లక్ష్మయ్య

మానకొండూర్: ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలు ఇస్తూ, ఎత్తుగడ వేస్తోందని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య ఆరోపించారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావుతో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలు ప్రచార ఆర్భాటం, మభ్యపెట్టే ఆలోచన, చేసే పనుల్లో ప్రచారం జోరు చూపించేలా జరుగుతోందన్నారు. కాలక్రమేణ మార్పు చెందుతున్న రాజకీయాలను చూస్తే బాధేస్తోందని అన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఈ ప్రభుత్వంలో కొనసాగిస్తారా అని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలకు ఎంతడబ్బు అవసరమో తేల్చి చెప్పగలరా అని అడిగారు. మూసీ సుందరీకరణకు డబ్బులు ఎక్కడ నుంచి తెస్తారో చెప్పాలన్నారు. 24 లక్షల ఇందిరమ్మ ఇళ్లకు, 20వేల మెగావాట్ల విద్యుత్ అవసరాలకు, భూసేకరణకు రూ.1.15 వేల కోట్లు అదనంగా కావాల్సి ఉందని, ఈ నిధులు ఎక్కడి నుంచి తేస్తారో చెప్పాలన్నారు. అనుభవ రాహిత్యం, అవగాహన లేమి, అహంకారి అని పరోక్షంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రం పసుపు బోర్డు ఏర్పాటు చేయడంపై సంతోషం వ్యక్తం చేశారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌పాలనలో సగటు ఆదాయం మూడు రేట్లు పెరిగిందన్నారు. సంపద పెంచడానికే అప్పులు చేస్తామన్నారు. కేడీసీసీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మాజీ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, ఎరుకల శ్రీనివాస్‌గౌడ్, శాతరాజు యాదగిరి, దండబోయిన శేఖర్, పిట్టల మధు, ఉండింటి శ్యాంసన్ పాల్గొన్నారు.

న్యాయసేవలపై శిక్షణ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ కోర్టులోని న్యాయసేవాసదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో శుక్రవారం బాలలకు స్నేహపూర్వక న్యాయ సేవలపై శిక్షణ అందించారు. పానెల్ న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లకు స్నేహపూర్వక న్యాయసేవలు ఏ విధంగా అందించాలనే విషయంపై అవగాహన కల్పించారు. లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ తణుకు మహేశ్, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీసీపీవో పర్వీన్, గసికంటి కొమురయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

‘ఆరోగ్య మహిళ’పై విస్తృత ప్రచారం

- వైద్యాధికారులతో సమీక్షలో కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్‌టౌన్: ఆరోగ్య మహిళ కార్యక్రమం గురించి గ్రామాల్లో విస్తృత ప్రచారం చేయాలని, హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి నూరుశాతం మహిళలకు వైద్య పరీక్షలు పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ వార్డుల్లో, గ్రామాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. బీపీ, షుగర్ నియంత్రణ మందులు ప్రభుత్వాసుపత్రిల్లో ఉంటాయన్న విషయం చాలామందికి తెలియక కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రిలో లభించే మందులపై అవగాహన కల్పించాలని సూచించారు. మొదటి కాన్పులో సాధారణ డెలివరీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్‌దేశాయ్, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఎంహెచ్‌వో వెంకటరమణ, సూపరింటెండెంట్ వీరారెడ్డి, అడిషనల్ డీఎంహెచ్‌వో సుజాత పాల్గొన్నారు.

పోషకాహార లోపాన్ని నివారించాలి

హుజూరాబాద్: చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించాలని కలెక్టర్ పమేలా సత్పతి తెలపారు. సింగాపూర్ గ్రామంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ పరీక్షలు, అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం ఇళ్లకు తీసుకెళ్లకుండా అక్కడే తినాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య మహిళ కింద రూ.40వేల విలువైన 54 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. హుజూరాబాద్ ఆర్డీవో రమేశ్‌బాబు, డీఎంహెచ్‌వో వెంకటరమణ, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో సునీత పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో వివరాలు నమోదు చేయాలి

ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా పథకాలకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. బోర్నపల్లి, సింగాపూర్ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. రేషన్‌కార్డుల జారీకి సంబంధించి ఇంటింటికి వెళ్లి కుటుంబ ఆర్థిక స్థితిగతులు పరిగణనలోకి తీసుకోవాలన్నారు. గడువులోగా ప్రక్రియ పూర్తిచేసి గ్రామసభలు నిర్వహించాలని సూచించారు.

వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు



మాట్లాడుతున్న ఎస్‌ఈ రమేశ్‌బాబు

కొత్తపల్లి(కరీంనగర్): రాబోయే వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా తగిన చర్యలు చేపట్టాలని టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్‌ఈ మేక రమేశ్‌బాబు సూచించారు. కరీంనగర్ విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో డీఈలు, ఏడీఈలు, ఏఈలు, ఏఈఓలతో శుక్రవారం సర్కిల్‌స్థాయి సమీక్ష నిర్వహించారు. వేసవిలో పెరగనున్న విద్యుత్ వినియోగంతో ఓవర్ లోడ్ సమస్య తలెత్తకుండా పీటీఆర్, డీటీఆర్‌లను మెరుగుపర్చుకోవాలి, లేదంటే నూతన డీటీఆర్లను ఏర్పాటు చేయాలన్నారు. వ్యవసాయ సర్వీసులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఇంటర్లింకింగ్ లైన్స్, ఆర్‌అండ్‌ఎం అతిత్వరలో పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సబ్ స్టేషన్లలో సింగల్ ఎర్తింగ్, డబుల్ ఎర్తింగ్ చేయాలని, విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా లైన్లు, సిబ్బందికి తగిన భద్రత జాగ్రత్తలు సూచించాలన్నారు. వర్క్ ఆర్డర్లు తొందరగా పూర్తి చేయాలని, రెవెన్యూలో వందశాతం వసూలు చేసి కరీంనగర్ సర్కిల్‌ను నంబర్‌వన్‌స్థానంలో నిలపాలని కోరారు. డీఈలు చంద్రమౌళి, రాజం, తిరుపతి, లక్ష్మారెడ్డి, కాళిదాసు, రమణారెడ్డి, ఏడీలు శ్రీనివాస్, లావణ్య, నరేందర్, కిరణ్, ఏఈలు, ఏఓలు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ప్రారంభం

కరీంనగర్ సర్కిల్ పరిధిలోని టౌన్–1 సబ్‌డివిజన్, టౌన్–1 సెక్షన్‌లో మూడు 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, టౌన్–3లో ఒక 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను టౌన్ డీఈ జంపాల రాజంతో కలిసి ఎస్‌ఈ మేక రమేశ్‌బాబు ప్రారంభించారు. టౌన్–1 ఏడీఈ పంజాల శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సైకిల్‌పై బల్దియాకు ఈఈ యాదగిరి




సైకిల్‌పై వెళ్తున్న ఈఈ యాదగిరి

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ నగరపాలకసంస్థ ఈఈ రొడ్డ యాదగిరి శుక్రవారం సైకిల్‌పై కార్యాలయానికి వచ్చి షాక్ ఇచ్చారు. తనకు నగరపాలకసంస్థ నుంచి కారు కేటాయించకపోవడంతోనే, ఇంటి నుంచి సైకిల్‌పై వచ్చినట్లు తెలిసింది. సాధారణంగా ఈఈ, డీఈలకు నగరపాలకసంస్థ నుంచి అద్దె ప్రాతిపదికన కార్లు కేటాయిస్తారు. ప్రస్తుతం డీఈలకు కూడా కార్లు ఉన్నాయి. ఈఈగా కరీంనగర్‌కు వచ్చిన సమయంలోనే తనకు కారు కేటాయించకపోవడంపై యాదగిరి నిరసన తెలిపారు. అప్పట్లో కొద్దిరోజులు కారు కేటాయించినా, మళ్లీ లేకుండా పోయింది. తన కిందిస్థాయి అధికారులకు కారు ఉండి, తనకు మాత్రం కారు ఇవ్వకపోవడంతో సైకిల్‌పై వచ్చి ఓ విధంగా నిరసన వ్యక్తం చేశారు.

నిలిచిన ఆరోగ్యశ్రీ సేవలు

- నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వెలసిన బోర్డులు



కరీంనగర్‌టౌన్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రాజీవ్ ఆరోగ్యశ్రీ సేవలు శుక్రవారం నుంచి నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రుల యాజమాన్యాలు వెల్లడించాయి. ఏడాదిగా ఆరోగ్యశ్రీ సేవలకు ప్రభుత్వం నుంచి బిల్లులు రాకపోవడంతో సేవలు నిలిపివేస్తున్నట్లు ఆయా ఆస్పత్రుల నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 49 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు, అందులో 32 ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. ఈ మేరకు ఆయా ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నట్లు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నెల 10వ తేదీ నుంచే సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించినప్పటికీ ప్రభుత్వ హామీ మేరకు తిరిగి సేవలు అందించాయి. బకాయిల పంచాయితీ తేలకపోవడంతో శుక్రవారం నుంచి సేవలు నిలిపివేశాయి. ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు బోధనాసుపత్రులలో, అపోలోరీచ్‌లో సేవలు కొనసాగుతున్నాయి.

క్లుప్తంగా

'కిలిమంజారో' అధిరోహణ



కిలిమంజారో పర్వతంపై మహిపాల్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్: కరీంనగర్‌కు చెందిన పర్వతారోహకుడు, ఎక్సైజ్ కానిస్టేబుల్ లెంకల మహిపాల్ రెడ్డి అరుదైన ఘనత సాధించారు. గతంలో కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించిన ఆయన శుక్రవారం మరోసారి అదే పర్వతాన్ని అధిరోహించి, రికార్డు సృష్టించారు. ఈ నెల 16న కిలిమంజారో పర్వతారోహణను ప్రారంభించిన మహిపాల్‌రెడ్డి శుక్రవారం పూర్తి చేశారు. పర్వతంపై సే నో టు డ్రగ్స్ అనే బ్యానర్ ఆవిష్కరించారు. రెండోసారి మౌంట్ కిలిమంజారో అధిరోహణకు సహకరించిన ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

గుకేశ్, హంపిలను కలిసిన 'చెస్' జిల్లా కార్యదర్శి



గుకేశ్‌కు జ్ఞాపిక ఇస్తున్న అనూప్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్: చెస్ ప్రపంచ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్న దొమ్మరాజు గుకేశ్, భారత చెస్ క్రీడాకారిణి కోనేరు హంపిలను కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ డైరెక్టర్, కోచ్, ఇంటిగ్రేటెడ్ చెస్ జిల్లా కార్యదర్శి కంకటి అనూప్‌కుమార్ శుక్రవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని సత్కరించి, వేంకటేశ్వరస్వామి జ్ఞాపికలు అందించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా చెస్‌కు విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. భవిష్యత్తులో చెస్ మెగా టోర్నీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అనంతపల్లిలో చేపలు మృతి



బోయినపల్లి(చొప్పదండి): అనంతపల్లిలో మత్స్యకారులు పెంచుకుంటున్న చేపలు శుక్రవారం మృతిచెందాయి. చేపల మృతిపై మత్స్యకారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని బందంకుంటలో గ్రామానికి చెందిన మత్స్యకారులు చేపలు పెంచుతున్నారు. బందంకుంట వద్దకు శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా చేపలు చనిపోయి కనిపించాయి. వీటి విలువ దాదాపు రూ.లక్ష వరకు ఉంటుందని వారు తెలిపారు. బందంకుంటను జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య పరిశీలించారు. కుంటలోని మట్టి, నీరును టెస్టింగ్ కోసం హైదరాబాద్ పంపినట్లు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

చొప్పదండి: భూపాలపట్నంకు చెందిన నాంపల్లి సూరవ్వ అనే మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై అనూష తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. సూరవ్వ కొంతకాలంగా అనారోగ్యంతో బాధ పడుతోంది. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగింది. కుటుంబసభ్యులు కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుమారుడు మహేశ్ శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'సీఎం కప్'లో.. టాప్ 10లో

• పతకాల పట్టికలో కరీంనగర్‌కు పదోస్థానం • వరుసగా 28, 30, 31వ స్థానాల్లో నిలిచిన జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి • రాష్ట్రస్థాయి జూడో పోటీల నిర్వహణతో కరీంనగర్‌కు పెరిగిన ఖ్యాతి

కరీంనగర్ స్పోర్ట్స్: సీఎం కప్–2024 క్రీడా పోటీలను ప్రభుత్వం అట్టహాసంగా నిర్వహించింది. డిసెంబర్ 7 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల్లో సుమారు 36 క్రీడాంశాల్లో పోటీలు జరిగాయి. గ్రామీణ ప్రాంతాలకు చెందిన మెరికల్లాంటి క్రీడాకారులు ఎందరో వెలుగులోకి వచ్చారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులు సత్తా చాటి, పలు పతకాలు సాధించారు. పతకాల పట్టికలో కరీంనగర్ 10వ స్థానంలో నిలవడం విశేషం. జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలు వరుసగా 28, 30, 31వ స్థానాల్లో నిలిచాయి. అంతేకాకుండా, డిసెంబర్ 26 నుంచి 29 వరకు రాష్ట్రస్థాయి జూడో పోటీల నిర్వహణతో కరీంనగర్‌కు ఖ్యాతి పెరిగింది.



రజతం సాధించిన పారా వాలీబాల్ కరీంనగర్ పురుషుల జట్టు



కాంస్య పతకం గెలిచిన హ్యాండ్‌బాల్ ఉమ్మడి జిల్లా పురుషుల జట్టు

కరీంనగర్.. 48 పతకాలు



సైక్లింగ్‌లో 2 బంగారు పతకాలు సాధించిన హృతికేశ్



జూడోలో బంగారు పతకం గెలిచిన కార్తీక్

సీఎం కప్ పోటీల్లో కరీంనగర్ జిల్లా క్రీడాకారులు 10 బంగారు పతకాలతో కలిపి మొత్తం 48 పతకాలను సాధించారు. టీం విభాగంలో ఉమ్మడి జిల్లా నుంచి పోటీ పడిన బాలుర జట్టు అద్వితీయ ప్రతిభతో కాంస్య పతకం గెలుచుకుంది. అథ్లెటిక్స్‌లో 2 బంగారు, 3 రజత, 1 కాంస్య, సైక్లింగ్‌లో 2 బంగారు, జూడోలో 1 బంగారు, 3 రజత, 1 కాంస్య, కరాటేలో 1 బంగారు, 1 కాంస్య, పారా అథ్లెటిక్స్‌లో 1 బంగారు, 1 రజత, 1 కాంస్య, పవర్ లిఫ్టింగ్‌లో 1 బంగారు, 1 రజత, స్విమ్మింగ్‌లో 1 బంగారు, 2 రజత, 1 కాంస్య, యోగాలో 1 బంగారు, 2 రజత, 1 కాంస్య, జిమ్నాస్టిక్స్, కిక్ బాక్సింగ్, పారా వాలీబాల్‌లలో ఒక్కో రజత, బాక్సింగ్‌లో 1 రజత, 4 కాంస్య, బ్యాడ్మింటన్‌లో 1 కాంస్య, చెస్‌లో 1 కాంస్య, తైక్వాండోలో 1 రజత, 1 కాంస్య, రెజ్లింగ్‌లో 1 రజత, 2 కాంస్య, వుషులో 3 రజత, 2 కాంస్య పతకాలను క్రీడాకారులు కైవసం చేసుకున్నారు.

జగిత్యాల.. 18



పవర్ లిఫ్టింగ్‌లో స్వర్ణం గెలిచిన స్వప్నిక



యోగాలో స్వర్ణం సాధించిన మిక్విత్

జగిత్యాల జిల్లా క్రీడాకారులు 18 పతకాలు సాధించారు. పవర్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ క్రీడాకారిణి విరించి స్వప్నిక, యోగాలో మిక్విత్ బంగారు పతకాలు సాధించారు. పవర్ లిఫ్టింగ్‌లో 1 బంగారు, 2 రజత, 4 కాంస్య, యోగాలో 1 బంగారు, 1 కాంస్య, బాక్సింగ్‌లో 1 రజత, 2 కాంస్య, కరాటేలో 1 రజత, పారా బ్యాడ్మింటన్‌లో 1 రజత, కిక్ బాక్సింగ్‌లో 4 కాంస్య పతకాలు సాధించారు.

రాజన్న సిరిసిల్ల.. 13

రాజన్న సిరిసిల్ల జిల్లా క్రీడాకారులు 13 పతకాలను సాధించారు. కిక్ బాక్సింగ్‌లో ఎండీ.అయాన్ బంగారు పతకంతో మెరిశాడు. ఇందులోనే 1 కాంస్య, అథ్లెటిక్స్‌లో 2 రజత, 1 కాంస్య, వుషులో 1 రజత, 4 కాంస్య, యోగాలో 2 రజత, జూడోలో 1 కాంస్య పతకాలు వచ్చాయి.



వుషు పోటీల్లో 5 పతకాలు సాధించిన రాజన్నసిరిసిల్ల క్రీడాకారులు

పెద్దపల్లి.. 11



వుషులో స్వర్ణం గెలిచిన శ్రావ్యాంజలి

పెద్దపల్లి జిల్లా క్రీడాకారులు 11 పతకాలు సాధించారు. వుషులో 60 కేజీలలోపు విభాగంలో ఎస్.శ్రావ్యాంజలి బంగారు పతకం సాధించింది. ఇందులోనే 3 కాంస్య, జూడో, కరాటే, కిక్ బాక్సింగ్‌లలో ఒక్కో రజత, అథ్లెటిక్స్, బాక్సింగ్, పవర్ లిఫ్టింగ్, రెజ్లింగ్‌లలో ఒక్కో కాంస్య పతకాలు గెలిచారు.

టాప్-3లో నిలవడమే లక్ష్యం



జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుత ప్రదర్శన ఇచ్చారు. 18 క్రీడాంశాల్లో పతకాలు సాధించడం విశేషం. వచ్చే సంవత్సరం జరిగే సీఎం కప్ పోటీల్లో టాప్-3లో నిలవడమే లక్ష్యం. ఇందుకోసం ఇప్పటినుంచే సమాయత్తమవుతాం.

– వి.శ్రీనివాస్ గౌడ్, డీవైఎస్‌వో, కరీంనగర్

అట్టహాసంగా నిర్వహించాం



జూడో పోటీలను కరీంనగర్‌లో అట్టహాసంగా నిర్వహించాం. ఈ పోటీలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జూడోకు క్రేజ్ వచ్చింది. ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులే 7 పతకాలు కైవసం చేసుకోవడం శుభపరిణామం.

– గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, తెలంగాణ జూడో సంఘం ప్రధాన కార్యదర్శి

భవిష్యత్‌లో మరిన్ని పతకాలు



వుషు క్రీడలో ఉమ్మడి జిల్లాకు చెందిన క్రీడాకారులు అత్యధికంగా 14 పతకాలు సాధించారు. చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించే దిశగా క్రీడాకారులను తీర్చిదిద్దుతాం.

– బార విద్యాసాగర్, వుషు అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

హ్యాండ్‌బాల్‌కు ఆదరణ



జట్టు విభాగంలో ఉమ్మడి జిల్లా తరఫున హ్యాండ్‌బాల్ క్రీడలో మాత్రమే ఫలితాలు అనుకూలంగా రావడం విశేషం. బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచి, ఈ క్రీడకు ఆదరణ తీసుకొచ్చింది.

– బసరవేణి లక్ష్మణ్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి

బైక్ చోరీ కేసులో నిందితుడి అరెస్టు

• మూడు వాహనాలు స్వాధీనం



అరెస్టు చూపుతున్న డీఎస్పీ రఘుచందర్

జగిత్యాల క్రైం: బైక్ చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసి, మూడు వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆయన వివరాలు వెల్లడించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని కృష్ణానగర్‌కు చెందిన గుర్రం శరత్‌కుమార్ బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం స్థానిక చిన్న కెనాల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో జగిత్యాల చిలుకవాడలో ఉంటున్న కోరుట్ల గంగంపేటకు చెందిన ఎండీ.అమీర్ నంబర్ ప్లేట్ లేని వాహనంపై వచ్చాడు. అతని వద్ద ఎటువంటి వాహన పత్రాలు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో 2024 అక్టోబర్ 20న జగిత్యాల కొత్త బస్టాండ్ నుంచి కరీంనగర్ వెళ్లే దారిలో ఒక బైక్, 2024 డిసెంబర్ 18న అశోక్‌నగర్‌లోని ఓ ఆస్పత్రి ఎదుట మరో బైక్‌ను ఎత్తుకెళ్లినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులు మొత్తం మూడు వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అమీర్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్, ఎస్సైలు మన్మదరావు, గీత, కానిస్టేబుళ్లు జీవన్, అనిల్ పాల్గొన్నారు.

డబ్బులు, ఫోన్ లాక్కెళ్లిన ఇద్దరి రిమాండ్

ఓ వ్యక్తిని బెదిరించి, డబ్బులు, ఫోన్ లాక్కెళ్లిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన దుర్గం సాయిబాబా కొంతకాలంగా జగిత్యాల బైపాస్ రోడ్‌లోని గోవిందుపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈ నెల 16న పని నిమిత్తం బయటకు వెళ్లి, తిరిగి వస్తున్నాడు. రాత్రి 10.30 గంటల సమయంలో గోవిందుపల్లి వద్ద గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వచ్చి, అతన్ని అడ్డగించారు. చంపుతామని బెదిరించి, రూ.2,800, సెల్‌ఫోన్ లాక్కొని, పారిపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సాంకేతిక పరిజ్ఞానంతో నిందితులు జగిత్యాల పురాణిపేటకు చెందిన పోచంపల్లి శంకర్, జగిత్యాల రూరల్ మండలం బాలపల్లికి చెందిన సిరికొండ నరేశ్‌లుగా గుర్తించారు. శుక్రవారం జగిత్యాల మంచినీళ్ల బావి వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరూ పట్టుబడ్డారని డీఎస్పీ పేర్కొన్నారు. నగదు, ఫోన్, బైక్ స్వాధీనం చేసుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో నిందితులను అరెస్టు చేసిన పట్టణ పోలీసులను ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో సీఐ వేణుగోపాల్, ఎస్సైలు మన్మదరావు, గీత పాల్గొన్నారు.

ఉత్సాహంగా తెప్పల పోటీలు

• మూడేళ్లుగా సంక్రాంతి సందర్భంగా మిడ్‌మానేరులో నిర్వహణ
• తరలివచ్చిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు
• జిల్లాస్థాయిలో నిర్వహణకు ఏర్పాట్లు చేయండి : విప్ ఆది శ్రీనివాస్





తెప్పల పోటీల్లో పాల్గొన్న మత్స్యకారులు, విజేతకు కప్ అందిస్తున్న విప్ శ్రీనివాస్, ఎస్పీ అఖిల్ మహాజన్

వేములవాడ అర్బన్: వేములవాడ మండలంలో సంక్రాంతి అంటే గుర్తొచ్చేది తెప్పల పోటీలు. ఈ ప్రాంత ముదిరాజ్ మత్స్యకారులు ప్రతీరోజు మిడ్ మానేరు ప్రాజెక్టులో చేపలు పడుతుంటారు. మూడేళ్లుగా నిర్వహిస్తున్న తెప్పల పోటీలను శుక్రవారం ఉత్సాహంగా జరిపారు.

సుమారు 2 కి.మీ. వెళ్లి..

వేములవాడ మండలంలోని రుద్రవరం పాత గ్రామం మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో రుద్రవరం ముదిరాజ్ మత్స్యకారుల ఆధ్వర్యంలో తెప్పల పోటీలు నిర్వహించారు. మానేరు ఒడ్డు నుంచి తెప్పలపై సుమారు 2 కిలోమీటర్లు వెళ్లి, అక్కడ నీటిలో ఏర్పాటు చేసిన జెండాను తీసుకొని ముందుగా వచ్చినవారే విజేతలు. ఈ పోటీలను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

పోటీపడిన 42 మంది..

వేములవాడ, నాంపల్లి, రుద్రవరం, సంకెపల్లి, అనుపురం, చింతాల్‌ఠాణ, చీర్లవంచ గ్రామాలకు చెందిన మత్స్యకారులు తెప్పల పోటీల్లో పాల్గొన్నారు. గ్రామానికి ఆరుగురి చొప్పున మొత్తం 42 మంది పోటీ పడ్డారు. మొదటి బ్యాచ్‌లో 22 మంది, రెండో బ్యాచ్‌లో 20 మంది ఉన్నారు. మొదటి బ్యాచ్‌లో గెలిచిన ముగ్గురు, రెండో బ్యాచ్‌లో గెలిచిన ముగ్గురికి మళ్లీ పోటీ నిర్వహించారు. వీరిలో ముగ్గురికి మొదటి, రెండో, మూడో బహుమతి అందించారు.

విజేతలు వీరే..

విజేతలుగా నిలిచిన రుద్రవరం గ్రామానికి తునికి రఘు(ప్రథమ స్థానం)కు రూ.10,116, కప్, నాంపల్లికి చెందిన కూన కుమార్(ద్వితీయ)కు రూ.5,116, కప్, పంగుడ వంశీ(తృతీయ) రూ.3,116, కప్ గెలుచుకున్నారు. వీరిని మత్స్యకారులు సన్మానించారు.

పోటీలు నిర్వహించడం గర్వకారణం..

రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా మన ప్రాంతంలోని మిడ్ మానేరులో సంక్రాంతికి తెప్పల పోటీలు నిర్వహించడం గర్వకారణమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. విజేతలకు ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి, బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెప్పల పోటీలను ప్రభుత్వం తరఫున నిర్వహించామని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని, కేజ్ కల్చర్ విధానంలో చేపల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముంపు గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముదిరాజ్‌లను బీసీ–డీ నుంచి ఏలోకి మార్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రేగులపాటి పాపారావు, జిల్లా మత్స్యశాఖ అధికారి సౌజన్య, నాయకులు పిల్లి కనకయ్య, గాలిపెల్లి స్వామి, రాంరెడ్డి, కత్తి కనకయ్య, మల్లేశం, తునికి మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా ఉంది



మానేరు నీటిలో తెప్పల పోటీల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఈ సంవత్సరం కూడా నేనే మొదటి బహుమతి గెలుచుకున్న. చెప్పలేని ఆనందం కలుగుతోంది.

– తునికి రఘు, రుద్రవరం

ప్రతీరోజు చేపల వేట



చిన్నప్పటి నుంచే చెరువులో చేపలు పట్టడం అలవాటైంది. ఇప్పుడు మిడ్‌మానేరు ప్రాజెక్టులో ప్రతీరోజు చేపల వేటకు వెళ్తున్న. తెప్పల పోటీలో రెండో బహుమతి గెలిచాను.

– కూన కుమార్, నాంపల్లి

మూడో బహుమతి గెలిచా



సంక్రాంతి పండుగ వస్తుందంటే మిడ్ మానేరులో తెప్పల పోటీలపై చర్చించుకుంటాం. పోటీలు సంబురంగా సాగుతాయి. నేను మూడో బహుమతి గెలిచాను.

– పండుగ వంశీ, రుద్రవరం

మూడోసారి పోటీలు..



తెప్పల పోటీలు నిర్వహించడం ఇది మూడోసారి. మత్స్యకారులకు ప్రభుత్వం 100 శాతం సబ్సిడీతో వలలు, తెప్పలు, గూడ్స్ వాహనాలు, ద్విచక్ర వాహనాలు అందించాలి.

– తునికి నరేశ్, తెప్పల పోటీల వ్యవస్థాపక అధ్యక్షుడు

అంధకారంలో సిరిసిల్ల బల్దియా

• బిల్లు చెల్లించలేదని పవర్ కట్
• సెస్ అధికారుల చర్యతో షాక్
• రాత్రి పునరుద్ధరణ



చీకటిలో పని చేస్తున్న అధికారి

సిరిసిల్లటౌన్: కరెంటు బిల్లులు చెల్లించలేదంటూ సిరిసిల్ల సెస్ అధికారులు బల్దియాకు షాక్ ఇచ్చారు. శుక్రవారం ఉదయం మున్సిపల్ కార్యాలయానికి సంబంధించిన విద్యుత్ సర్వీసులు తొలగించారు. మున్సిపాలిటీ రూ.4.60 కోట్ల విద్యుత్ బిల్లులు సెస్‌కు బకాయి పడింది. చెల్లించాలని డిసెంబర్ నుంచి రెండు పర్యాయాలు నోటీసులు అందించారు. బిల్లుల చెల్లింపులో స్పందన లేకపోవడంతో శుక్రవారం సెస్ ఎండీ విజయేందర్‌రెడ్డి ఆదేశాలతో సిబ్బంది బల్దియాకు కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో అధికారులు చీకట్లోనే సేవలందించారు. త్వరలోనే బిల్లులు చెల్లిస్తామని సెస్ అధికారులతో మున్సిపల్ అధికారులు మాట్లాడగా..రాత్రి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు కమిషనర్ లావణ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

• ఘటనకు కారణమైన వ్యక్తిపై కేసు

జమ్మికుంట(హుజూరాబాద్): ఓ బైక్ మరో రెండు ద్విచక్రవాహనాలను ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. జమ్మికుంట టౌన్ సీఐ రవి తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కేశవాపూర్ గ్రామానికి చెందిన మైస అభిషేక్ శుక్రవారం బైక్‌ను అజాగ్రత్తగా నడుపుతూ.. రెండు ద్విచక్ర వాహనాలను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఈదునూరి కుమారస్వామి, సుమలత, ముక్కెర సుగుణమ్మ, రాజకొమురయ్యలకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలు సుగుణమ్మ ఫిర్యాదు మేరకు ప్రమాదానికి కారణమైన అభిషేక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

స్తంభాన్ని ఢీకొన్న కారు : ఆర్‌ఎంపీ దుర్మరణం

కొత్తపల్లి(కరీంనగర్): రోడ్డు ప్రమాదంలో ఓ ఆర్‌ఎంపీ మృతిచెందినట్లు కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. ఇల్లంతకుంటకు చెందిన ఒరుగంటి రామచంద్రం(63) కొన్నేళ్లుగా కొత్తపల్లి మండలంలోని బావుపేటలో ఆర్‌ఎంపీగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం బావుపేట నుంచి కారులో కరీంనగర్ వెళ్తున్నాడు. చింతకుంట శివారులో ఎదురుగా వచ్చే వాహనాన్ని తప్పించుబోయి కారు అదుపుతప్పి, రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో స్తంభం విరిగి, కారుపై పడటంతో రామచంద్రం తలకు బలమైన గాయాలై, మృతిచెందాడు. మృతుడి కుమారుడు డేవిడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు ధర్మగుండంలో స్నానాలు చేసిన అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కోడె మొక్కు చెల్లించి, ప్రత్యేక పూజలు చేశారు.

నేటి నుంచి త్యాగరాజ ఆరాధనోత్సవాలు

రాజన్న ఆలయంలో శనివారం నుంచి త్యాగరాజస్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. అభిషేకం టికెట్లు ఈనెల 18 నుంచి 22 వరకు ఉదయం 8.30 గంటల తర్వాత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం, సోమవారం రెండు రోజుల్లో అభిషేకాలు రద్దు చేయనున్నట్లు తెలిపారు.

శివదీక్షలు ప్రారంభం


రాజన్న క్షేత్రంలో శుక్రవారం శివదీక్షలు ప్రారంభమయ్యాయి. అభిషేక మండపంలో ఆలయ ప్రధాన అర్చకులు, గురుస్వాముల ఆధ్వర్యంలో భక్తులు శివమాలలు ధరించారు. శివదీక్ష చేపట్టిన స్వాములు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మాల విరమణ చేయనున్నారు. ఆలయ అర్చకులు నందగిరి భానుశర్మ, శంకరయ్యశర్మ, గురుస్వామి వాసాలమర్రి గోపి తదితరులు ఉన్నారు.

తహసీల్ ఆఫీస్‌పై దాడి కేసులో 11 మందికి జైలు

కోనరావుపేట(వేములవాడ): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంపై దాడిచేసిన వారికి జైలుశిక్ష విధించినట్లు ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. 2017, మార్చి 19న కోనరావుపేట తహశీల్దార్ కార్యాలయంపై నిమ్మపల్లికి చెందిన జవ్వాజి విమల, డీలర్ చంద్రకళ, మ్యాదరి దేవయ్య, బండ రాజయ్య, బండ సత్తయ్య, పూజం రాజయ్య, గంగాధర్, పూజం లింగయ్య, రెడ్డిమల్ల లచ్చయ్య, మ్యాదరి మధు, జవ్వాజి గంగాధర్ దాడి చేశారు. ఈ ఘటనపై అప్పటి తహసీల్దార్ నాగరాజమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం జవ్వాజి విమలతోపాటు మరో 10 మంది నిందితులకు ఏడాది జైలు, రూ.3వేలు జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీణ్ తీర్పు చెప్పారు. నిందితులు జిల్లా కోర్టులో అప్పీల్ చేయగా జిల్లా న్యాయమూర్తి వారి అప్పీల్‌ను తిరస్కరిస్తూ ఏడాది జైలుశిక్ష విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

హేబీస్.. హ్యాపీస్

కొంతమంది చిన్న చిన్న విషయాలకే ఆందోళన పడిపోతుంటారు. కొందరు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంటారు. సంతోషంగా ఉండటమనేది పూర్తిగా మన వ్యక్తిత్వం, అలవాట్ల పైనే ఆధారపడి ఉంటుందని నిపుణులు అంటారు. వీళ్లు ఎన్ని బాధలు ఎదురైనా సంతోషాన్ని దూరం చేసుకోరు. అదెలా సాధ్యం? సంతోషంగా ఉండే వారి అలవాట్లు ఏంటో తెలుసుకుందామా?





సంతోషంగా ఉండేవారు కుటుంబంతోనూ, స్నేహితులతోనూ ఎక్కువ సమయం గడపడటానికి ఇష్టపడతారని, వీరిని కష్టాలు, బాధలు చుట్టిముట్టినప్పుడు తమ కుటుంబం, స్నేహితులతోనే వాటిని పంచుకుంటూ మనసు తేలిక చేసుకుంటారన్నది హ్యాపీ పీపుల్ హ్యాబిట్స్‌లో బయట పడిన విషయం. వీరు తాము సంతోషంగా ఉంటూ, తమ కుటుంబాన్ని, స్నేహితులనూ కూడా సంతోషంగా ఉండేలా చూస్తారు.

పొద్దున్నే నిద్రలేవడం

సంతోషంగా ఉన్న వ్యక్తులు ఉదయాన్నే నిద్రలేస్తారు. పని ఉన్నా... లేకున్నా పొద్దున్నే లేవడం మానుకోరు. తమకు తాముగా కొన్ని నిబంధనలు, పరిమితులు విధించుకుని తమ రోజును ప్రారంభిస్తారు. అలాగే వ్యాయామం, ఆధ్యాత్మిక చింతన, కొత్త విషయాలను తెలుసుకోవడం, పరిశోధనలు, అధ్యయనం వంటి వాటితో నాణ్యమైన సమయాన్ని గడుపుతారు.

ధ్యానం

సంతోషంగా ఉన్నవారు ధ్యానంలో ఎక్కువ సమయాన్ని గడుపుతారు. ధ్యానంతోనే తమ ప్రతికూల ఆలోచనలను నియంత్రిస్తారు. సానుకూలతను పొందడానికి ప్రయత్నిస్తారు. సంతోషకరమైన, స్వీయ-అవగాహన ఉన్న వారికి ధ్యానం ఒక ముఖ్యమైన అలవాటు.

ప్రకృతిలో గడపడం



ఎప్పుడూ సంతోషంగా ఉండేవారు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తినడంతోపాటు ప్రకృతితో మంచి సమయాన్ని గడపడాన్ని ఇష్టపడతారు. ఇది మానసిక స్థితిని ప్రభావితం చేస్తుంది. మనస్సును నిర్మలంగా ఉంచుతుంది. సకారాత్మక ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెడుతుంది. అలాగే తమతో తాము మరింతగా కనెక్ట్ అయ్యేలా చేస్తుంది.

ఆరోగ్యకరమైన ఆహారం

సంతోషంగా ఉన్న వ్యక్తులు క్రమం తప్పకుండా ఆరోగ్యకరమైన ఆహారాన్నే తినడానికి ప్రయత్నిస్తారు. అలాగే ప్రతిరోజూ ఉదయం బ్రేక్ ఫాస్ట్ తో పాటు తగినన్ని నీటిని తాగుతారు.

కంటినిండా నిద్ర



మన శరీరానికి నిద్ర చాలా చాలా అవసరం. ఒక వ్యక్తి ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ రాత్రి 7 నుంచి 9 గంటల రాత్రి నిద్ర చాలా అవసరం. నాణ్యమైన నిద్ర మనసును సంతోషంగా ఉంచుతుంది. తగినంత నిద్ర లేనివారు చికాకు పడుతూ చిర్రుబుర్రులాడటం చూస్తూనే ఉంటాం.

కనీస వ్యాయామం

ఎప్పుడు చూసినా ఉత్సాహంగా.. ఉల్లాసంగా ఉండేవారు శరీరానికి, మెదడుకూ కూడా తగినంత వ్యాయామం కల్పిస్తారని పరిశోధనలలో తేలింది. వయసుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ కనీసం వాకింగ్, రన్నింగ్, జాగింగ్, తేలికపాటి బరువులు ఎత్తడం, లిఫ్ట్ ఉపయోగించకుండా మెట్లెక్కడం, గార్డెనింగ్ వంటి శారీరక వ్యాయామంతోపాటు మెదడును పదును పెట్టే చెస్, బిజినెస్, క్రాస్‌వర్డ్స్ పూరించడం, సుడోకు వంటి వాటిలో పాల్గొనడం వల్ల సంతోషంగా ఉండగలరు.

అంటే మన అలవాట్లు... అదేనండీ.. హేబీసే... హ్యాపీస్ అన్నమాట. కాబట్టి మంచి అలవాట్లతో మరింత సంతోషంగా జీవిద్దాం.

లైఫ్@360

● ప్లీజ్ క్లీన్

వాడర్ బాటిల్



ఒకప్పుడు ప్రయాణాలలో మాత్రమే వెంట తీసుకెళ్లే వాటర్ బాటిల్స్‌ని ఇప్పుడు మనం పని చేసే సిస్టమ్ పక్కన లేదా మంచం పక్కన పెట్టుకోకుండా ఉండలేని పరిస్థితి వచ్చింది. ఎప్పుడు కావాలంటే అప్పుడు తాగేందుకు వీలుగా వాటర్ బాటిల్స్‌ని దగ్గర పెట్టుకోవడం వరకు తప్పేం లేదు కానీ, వాటిని సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల వాటి మీద మిలియన్లకొద్దీ సూక్ష్మజీవులు పేరుకుని పోయి రకరకాల జబ్బులు వస్తున్నాయని హెచ్చరిస్తున్నారు వైద్య, ఆరోగ్య పరిశోధకులు.

తాళం చెవులు, సెల్‌ఫోన్, మనీపర్స్, హ్యాండ్ బ్యాగ్‌లాగే వాటర్ బాటిల్ కూడా తప్పనిసరిగా వెంట తీసుకునిపోయే అవసరంగా మారింది. అయితే కొన్ని పరిశోధనల ప్రకారం తేలిందేమిటంటే, వాటర్ బాటిల్‌ను సరిగా శుభ్రం చేయకపోవడం వల్ల టాయిలెట్ సీట్ మీద కన్నా ఎన్నో ఎక్కువ రెట్లు సూక్ష్మజీవులు, బాటిల్ మీద, లోపల, మూత మీద బ్యాక్టీరియా పేరుకుపోతుందట. మనం ఇప్పుడు చెప్పుకోబోయే విషయాలు వినడానికి కొంచెం వింతగా... మరి కొంచెం బాధాకరంగా కూడా ఉండచ్చు. అయినా, చెప్పుకోక తప్పదు మరి!

స్ట్రా ద్వారా తాగే బాటిల్స్, సిప్పర్ బాటిల్స్, అలాగే నోటికి కరిపించుకుని తాగే బాటిల్స్... ఈ మూడు రకాల బాటిల్స్‌లోనూ రెండు రకాలైన బ్యాక్టీరియాను కనుగొన్నారు పరిశోధకులు. ఈ బ్యాక్టీరియా టైఫాయిడ్‌ను కలిగిస్తుంది. అందువల్ల తిరిగి వాడే వాటర్ బాటిల్స్‌ను తీరుబడిగా వారానికోసారి కాకుండా ప్రతిరోజూ సబ్బునీటితో, వేడి నీటితో శుభ్రంగా కడిగి ఉపయోగించడం చాలా మంచిది లేదంటే వ్యాధుల బారిన పడటం ఖాయం మరి!

● యోగా

వెన్నునొప్పి నివారణకు గోముఖాసన

ఆవు ముఖ భంగిమను పోలి ఉంటుంది కాబట్టి దీనికి గో ముఖాసన అని పేరు. శరీరం మొత్తం స్ట్రెచ్ అవుతుంది. కాళ్లు ఒకదానికి మీద ఒకటి చేరే ఈ ఆసనం చూడ్డానికి ఆవు ముఖంలా కనిపిస్తుంది. చేతులు ఆవు ముఖం చెవులను సూచిస్తాయి.

ఇలా చేయాలి..

- ముందుగా సౌకర్యంగా చాప మీద కూర్చోవాలి. ఎడమ కాలును మోకాలి వద్ద వంచుతూ కుడి తుంటి భాగానికి దగ్గరగా తీసుకువెళ్లాలి.
- మోకాళ్లు ఒకదానిపై ఒకటి ఉండేలా సెట్ చేయాలి.
- కుడి చేతిని పైకి లేపి, మోచేయి వద్ద వంచి, వీపు కిందకు ఉంచాలి.
- ఎడమ చేతిని వీపు వెనకకు తీసుకువెళ్లి, కుడి చేతిని పట్టుకోవడానికి ప్రయత్నించాలి.
- రెండు చేతులు కలవకపోతే ఆ ఖాళీని భర్తీ చేయడానికి టవల్ లేదా స్కార్ఫ్‌ను ఉపయోగించాలి.
- వెన్నెముకను నిటారుగా ఉంచి, కూర్చోవాలి.
- దీర్ఘ శ్వాస తీసుకొని, వదులుతూ సౌకర్యంగా అనిపించేంత వరకు ఈ ఆసనంలో ఉండచ్చు.
- మెల్లగా కాళ్లు, చేతులు విడదీసి యథా స్థితికి రావాలి. రెండోవైపు పై విధంగానే చేయాలి.

ప్రయోజనాలు..



డెస్క్ ఉద్యోగాలు చేసేవారిలో బ్యాక్ పెయిన్, హిప్ స్ట్రెస్ సాధారణంగా గమనిస్తుంటాం. వెన్నెముక స్ట్రెచ్ అవ్వడం వల్ల బ్యాక్‌పెయిన్ సమస్య తగ్గుతుంది. తుంటి, రక్తప్రసరణ, కీళ్ల కదలికలు మెరుగవుతాయి. దీర్ఘ శ్వాసలు తీసుకొని, వదలడం వల్ల శారీరక, మానసిక ఒత్తిడి తగ్గుతుంది.

వెన్ను, మోకాలు గాయాలు ఉన్నవారు నిపుణుల సాయం తీసుకోవాలి. కింద కూర్చోనేటప్పుడు కుషన్‌ను కాలు మడతల్లో ఉంచవచ్చు. తుంటి నొప్పి వస్తుంటే సాధారణ సుఖాసనలో కూర్చొని కూడా ఈ ఆసనాన్ని సాధన చేయవచ్చు.

చెప్పుకోదగ్గ విశేషం



పాదరక్షలు సురక్షితమైన నడకకు అత్యవసరాలు. పాదరక్షల ప్రయోజనం అక్కడికే పరిమితం కాలేదు. ఫ్యాషన్‌రంగంలోనూ పాదరక్షల పాత్ర పెరుగుతూ వస్తోంది. ఫ్యాషన్ స్థాయిని దాటిన అల్ట్రాలగ్జరీ పాదరక్షలు లేటెస్ట్ ట్రెండ్. ఈ పాదరక్షలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైనవిగా రికార్డులకెక్కాయి. వీటిని కొనాలంటే, ఒక మోస్తరు సంపన్నుల ఆస్తులు కూడా చాలవు. ఇవి 'మూన్ స్టార్ షూస్'. దుబాయ్‌లోని బుర్జ్ ఖలీఫా గౌరవార్థం ఇటాలియన్ డిజైనర్ ఆంటోనియో వీట్రీ వీటికి రూపకల్పన చేశారు. ప్రపంచంలోనే అతి ఎత్తయిన కట్టడం బుర్జ్ ఖలీఫా ఆకారాన్ని తలపించేలా రూపొందించిన ఈ పాదరక్షల ఖరీదు 19.9 మిలియన్ డాలర్లు. అంటే, రూ.164 కోట్లు. ఈ పాదరక్షల జత తయారీకి బంగారం, వజ్రాలతో పాటు గ్రహాంతర పదార్థాన్ని కూడా ఉపయోగించారు. అందుకే వీటి ధర అంతరిక్షాన్ని తాకే స్థాయిలో ఉంది. ఈ పాదరక్షల అడుగుభాగాన్ని తెల్లబంగారంతో తయారు చేశారు. పైభాగాన్ని పూర్తిగా మేలిమి బంగారంలో 30 కేరట్ల వజ్రాలను పొదిగి తయారు చేశారు. వీటి తయారీ లో క్రీస్తుశకం 1576లో అర్జెంటీనాలో రాలిపడిన ఉల్క నుంచి సేకరించిన పదార్థాన్ని కూడా ఉపయోగించడం విశేషం.

సాక్షి సినిమా



● 'దిల్' రాజు, ఐశ్వర్యా రాజేశ్, వెంకటేశ్, అనిల్ రావిపూడి, శిరీష్

ఇది తెలుగు ప్రేక్షకుల విజయం

- వెంకటేశ్

''కష్టపడి పని చేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని 'సంక్రాంతికి వస్తున్నాం' విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయమే కాదు.. ఇంత గొప్పగా సపోర్ట్, లవ్ చేసిన తెలుగు ఆడియన్స్, ఫ్యాన్స్ సక్సెస్. ఇది తెలుగు ప్రేక్షకుల విజయం'' అని హీరో వెంకటేశ్ అన్నారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్ హీరోగా నటించిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. మీనాక్షీ చౌదరి, ఐశ్వర్యా రాజేశ్ హీరోయిన్లుగా నటించారు. 'దిల్' రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'పొంగల్ బ్లాక్ బస్టర్ జాతర సెలబ్రేషన్స్'లో వెంకటేశ్ మాట్లాడుతూ– ''డైరెక్టర్ అనిల్, నిర్మాతలు 'దిల్' రాజు, శిరీష్‌గార్లకు, సినిమా యూనిట్‌కి థ్యాంక్స్. ఫిల్మ్ ఇండస్ట్రీలోని అందరూ మనస్ఫూర్తిగా ఫోన్ చేసి సినిమా బాగుందని అభినందిస్తున్నందుకు ధన్యవాదాలు'' అని చెప్పారు. అనిల్ రావిపూడి మాట్లాడుతూ– ''మేము ఊహించినదానికంటే సినిమాని ఎక్కువ స్థాయికి తీసుకెళ్లిన తెలుగు ప్రేక్షకులకు నా పాదాభివందనాలు. ఈ సినిమాతో నా కెరీర్‌లో ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు... ఆడియన్స్ సపోర్ట్ లేకపోతే నాకు ఈ విజయం వచ్చేది కాదు'' అన్నారు. ''వెంకటేశ్‌గారు నిర్మాతల బాగు కోరుకుంటారు. కాబట్టే ఇప్పటికీ కాలర్ ఎగరేస్తూ ముందుకు వెళ్తున్నారు'' అని శిరీష్ పేర్కొన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''అనిల్, వెంకటేశ్‌గారి కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్'' అని చెప్పారు. ''నేను చేసిన భాగ్యం పాత్ర క్రెడిట్ అంతా అనిల్‌గారికే దక్కుతుంది'' అన్నారు ఐశ్వర్యా రాజేశ్. ఈ వేడుకలో నటులు అవసరాల శ్రీనివాస్, శ్రీనివాస్ వడ్లమాని, మురళీధర్ గౌడ్, కెమెరామేన్ సమీర్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్ ఏఎస్ ప్రకాశ్, ఎడిటర్ తమ్మిరాజు, రచయితలు అజ్జు మహాకాళి, నాగ్, సాయి కృష్ణ తదితరులు మాట్లాడారు.

ఆహా ఏమి రుచి...






● చేపల కూర వండుతున్న నాగ చైతన్య

కట్టెల పొయ్యి వెలిగించారు నాగ చైతన్య. ఎందుకంటే చేపల పులుసు వండటానికి. వండాక అందరికీ వడ్డించారు కూడా. అందరూ 'బాగుంది' అని మెచ్చుకుంటూ, ఫుల్లుగా లాగించేశారు. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. ఇంతకీ చైతన్య ఇలా చేపల కూర వండటానికి కారణం ఏంటంటే... ఇచ్చిన మాట నిలబెట్టుకోవడానికే. 'తండేల్' చిత్రంలో ఈ హీరో మత్స్యకారుడి పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. విశాఖపట్నం, శ్రీకాకుళం తీర ప్రాంతాల్లోనూ ఈ చిత్రం షూటింగ్ జరిపారు. కాగా, 'మీ స్టయిల్‌లో చేపల కూర వండి పెడతా' అని విశాఖలో చిత్రీకరణలో పాల్గొన్నప్పుడు నాగచైతన్య అన్నారట. అన్నట్లుగానే చేపల కూర వండారు. కూర వండాక, అర చేతిలో కాస్త పులుసు వేసుకుని, రుచి చూసి, పక్కనే ఉన్న అమ్మాయికి ఇస్తే, 'బాగుందండి...' అని ఆమె అనడం, ఆ తర్వాత చైతు అక్కడ ఉన్నవారికి పులుసు వడ్డించి తాను కూడా తినడం వంటివన్నీ చిత్రీకరించి, ఆ వీడియోను షేర్ చేసింది చిత్రబృందం. ఇక ఆ వీడియోలో 'బాగుందా' అని చైతన్య అడగ్గా... ఆహా ఏమి రుచి అనే టైపులో 'బాగుంది.. చాలా బాగుంది' అంటూ అక్కడివాళ్లు తింటుంటే... 'పక్కానా... బాగోకపోతే ఏమీ అనుకోమాకండి... ఫస్ట్ టైమ్' అంటూ, వాళ్లతో కలిసి తానూ తిన్నారు చైతన్య. ఇక శ్రీకాకుళానికి చెందిన మత్స్యకారుల జీవిత కథతో రూపొందుతున్న 'తండేల్'లో నాగచైతన్య సరసన సాయి పల్లవి నటిస్తున్నారు. చందు మొండేటి దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న రిలీజ్ కానుంది.

మంచి మాట వినాలి



● పవన్ కల్యాణ్

పవన్ కల్యాణ్ హీరోగా నటిస్తున్న చిత్రం 'హరి హర వీరమల్లు: పార్ట్–1 స్వోర్డ్ వర్సెస్ స్పిరిట్'. జ్యోతికృష్ణ, క్రిష్ జాగర్లమూడి దర్శకులు. నిధీ అగర్వాల్, నర్గీస్ ఫక్రీ, నోరా ఫతేహి, బాబీ డియోల్ తదితరులు ముఖ్య పాత్రధారులు. ఏఎం రత్నం సమర్పణలో ఎ. దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 28న రిలీజ్ కానుంది. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించిన 'హరి హర వీర మల్లు' నుంచి 'మాట వినాలి..' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. 'మాట వినాలి గురుడా మాట వినాలి... మాట వినాలి... మంచి మాట వినాలి...' అంటూ సాగే ఈ పాటని పవన్ కల్యాణ్ పాడారు. ఈ పాటను పెంచల్ దాస్ రాశారు. ఈ చిత్రం ఐదు భాషల్లో రిలీజ్ కానుంది. ఈ క్రమంలో ఈ పాటను తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ వెర్షన్‌లోనూ రిలీజ్ చేశారు.



● ప్రియాంకా చోప్రా

లాస్ ఏంజెల్స్ టు హైదరాబాద్

ప్రముఖ హీరోయిన్ ప్రియాంక చోప్రా హైదరాబాద్‌లో అడుగుపెట్టారు. అందులో విషయం ఏముందీ అనుకోవచ్చు. సింగర్, యాక్టర్ నిక్ జోనాస్‌తో పెళ్లి తర్వాత అమెరికాలోని లాస్ ఏంజెల్స్‌లో స్థిరపడ్డారు ప్రియాంక. ఇప్పుడు ఇలా హైదరాబాద్‌లో అడుగుపెట్టడానికి కారణం ఏంటి? అనేది హాట్ టాపిక్‌గా మారింది. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందనున్న సినిమా కోసమే ఆమె భాగ్యనగరానికి చేరుకున్నారని టాక్. ఈ చిత్రంలో మహేశ్‌బాబుకి జోడీగా నటించే హీరోయిన్ల జాబితాలో ప్రియాంకా చోప్రా, కియారా అద్వానీ, ఇండోనేషియా నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్ వంటి వారి పేర్లు తెరపైకి వచ్చాయి. ఫైనల్‌గా ప్రియాంకా చోప్రాని కథానాయికగా ఫిక్స్ చేశారని భోగట్టా. ప్రియాంకా చోప్రా లాస్ ఏంజెల్స్ నుంచి హైదరాబాద్‌కి చేరుకోవడంతో ఈ మూవీ చిత్రీకరణ కోసమే ఆమె వచ్చారనే రూమర్లు వినిపిస్తున్నాయి. మరి... ఈ వార్త ఎంతవరకూ నిజమో తెలియాల్సి ఉంది.

శివరాత్రికి థ్రిల్



● ప్రజ్వల్ దేవరాజ్

కన్నడ హీరో ప్రజ్వల్ దేవరాజ్ నటిస్తున్న చిత్రం 'రాక్షస'. లోహిత్ .హెచ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 26న కన్నడతో పాటు తెలుగులోనూ రిలీజ్ కానుంది. తెలుగు విడుదల హక్కులను కంచి కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ అధినేత ఎంవీఆర్ కృష్ణ దక్కించుకున్నారు. గతంలో శివరాజ్ కుమార్ హీరోగా నటించిన 'వేద' చిత్రాన్ని ఆయన విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎంవీఆర్ కృష్ణ మాట్లాడుతూ– ''హారర్ నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రాక్షస'. మా సినిమా ప్రేక్షకులకు థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది. త్వరలోనే టీజర్, ట్రైలర్‌ను రిలీజ్ చేస్తాం'' అని చెప్పారు.

వెరైటీ యాక్షన్



● సత్య

సత్య వినుగొండ, అనుశ్రీ లీడ్ రోల్స్‌లో ఎస్ఎస్ మూవీ కార్పొరేషన్ పై సత్య వినుగొండ స్వీయ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. ఈ చిత్రం ఫస్ట్ లుక్ పోస్టర్‌ను 'జాతి రత్నాలు' దర్శకుడు అనుదీప్ ఆవిష్కరించారు. సత్య వినుగొండ మాట్లాడుతూ– ''వెరైటీ యాక్షన్ నేపథ్యంలో సాగే ఫన్ ఎంటర్‌టైనర్ మూవీ ఇది. మార్చిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం'' అని తెలిపారు.

నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా...



● సోనూగా... లైలాగా విశ్వక్

విశ్వక్ సేన్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లైలా'. రామ్ నారాయణ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆకాంక్షా శర్మ హీరోయిన్‌గా నటించారు. సాహు గారపాటి నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ సినిమా టీజర్‌ని శుక్రవారం రిలీజ్ చేశారు. 'చూసుకో... అయ్యయ్యో నీకు దెబ్బలేమీ తగల్లేదు కదా', 'మనకు తెల్లగ జేసుడే కాదు... తోలు తీసుడు కూడా వచ్చు' అంటూ విశ్వక్ సేన్ చెప్పే డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ''రొమాంటిక్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'లైలా'. ఈ మూవీలో మోడల్ సోనూగా, లైలా అనే అమ్మాయిగా విశ్వక్ సేన్ కనిపించే రెండు డిఫరెంట్ లుక్స్ సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి'' అని యూనిట్ పేర్కొంది.

సుకృతి నటన చూసి షాక్ అయ్యాను

- సుకుమార్



● నవీన్, రవిశంకర్, సుకుమార్, సుకృతి, తబితా సుకుమార్, పద్మావతి, శేష సింధూరావు

''నా కుమార్తె సుకృతికి చిన్నప్పటి నుంచి పాడటం అంటే చాలా ఇష్టం. కానీ, నటన మీద పెద్దగా ఆసక్తి లేదు. తను నటిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. అయితే దర్శకురాలు పద్మ, నిర్మాత సింధు కలిసి సుకృతిని నటించేందుకు ఒప్పించారు. 'గాంధీ తాత చెట్టు'లో సుకృతి నటన చూసిన తర్వాత షాక్ అయ్యాను.. అంత బాగా నటించింది'' అని డైరెక్టర్ సుకుమార్ తెలిపారు. ఆయన కుమార్తె సుకృతి వేణి బండ్రెడ్డి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'గాంధీ తాత చెట్టు'. పద్మావతి మల్లాది దర్శకత్వం వహించారు. సుకుమార్ భార్య తబితా సుకుమార్ సమర్పణలో నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధూరావు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సుకుమార్ మాట్లాడుతూ– ''ఈ చిత్రం సుకృతి లైఫ్‌లో మంచి జ్ఞాపకంలా మిగిలిపోతుంది. వినోదం, సందేశం ఉన్న 'గాంధీ తాత చెట్టు'ని అందరూ ఆదరించాలి'' అన్నారు. ''ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరూ పిల్లలతో కలిసి చూడాలి'' అన్నారు యలమంచిలి రవిశంకర్. ''ఈ సినిమా ఎక్కడా బోర్ కొట్టకుండా అందరికీ నచ్చుతుంది'' అన్నారు నవీన్ ఎర్నేని. ''షూటింగ్‌లో తొలి రోజు సుకృతి నటన చూసి హ్యాపీ ఫీలయ్యాను'' అని తబితా సుకుమార్ పేర్కొన్నారు. ''ఒక చెట్టుకు, మనిషికి మధ్య ఉన్న అనుబంధంతో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు పద్మావతి మల్లాది. ''ఈ సినిమా కోసం నాన్న (సుకుమార్) ఎటువంటి సలహాలు ఇవ్వలేదు'' అని సుకృతి బండ్రెడ్డి తెలిపారు.